క్లుప్తంగా

రీసర్వేలో లోపాలు ఉండరాదు

● సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్



కొమరోలు : రీసర్వేను పరిశీలిస్తున్న మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్

కొమరోలు: భూముల రీసర్వేలో లోపాలు ఉండకుండా పకడ్బందీగా టీమ్ మెంబర్స్ రీసర్వే చేపట్టాలని మార్కాపురం సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ తెలిపారు. మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామంలో బుధవారం మార్కాపురం సబ్‌కలెక్టర్ పర్యటించారు. గ్రామంలో జరుగుతున్న రీసర్వేను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రీసర్వే చేసేముందు సంబంధిత రైతులకు నోటీసులు ఇచ్చి రీసర్వే చేయించాలని తెలిపారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా రీసర్వేను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. వీరి వెంట తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

గురుకుల ప్రవేశానికి దరఖాస్తుల స్వీకరణ



ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి

బేస్తవారిపేట: అర్థవీడులోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి తెలిపారు. 4, 10వ తరగతి పూర్తయిన విద్యార్థులకు 5వ, ఇంటర్మీడియెట్ మొదటి ఏడాది చేరేందుకు ఆన్‌లైన్‌లో మార్చి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఉచిత పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూస్, స్టూడెంట్ స్టేషనరీ, కంప్యూటర్ విద్య, ల్యాబ్ సౌకర్యం, ఉత్తమ ప్రమాణాలతో విద్యనందిస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాత్కాలిక గోశాల ఏర్పాటు



గోశాల వద్ద కమిషనర్, సీఐ, ఎస్సై

మార్కాపురం టౌన్: పట్టణ ప్రజలకు, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తూ ఇబ్బంది పెడుతున్న 52 గోవులను తర్లుపాడు రోడ్డులోని పెద్ద వాటర్ ట్యాంకు వద్ద ఏర్పాటు చేసిన తాత్కాలిక గోశాలకు తరలించినట్లు కమిషనర్ నారాయణరావు తెలిపారు. ఆవులు నిత్యం రోడ్లపై సంచరిస్తూ ప్రజలను, వాహనదారులను ఇబ్బంది పెడుతున్నాయి. ప్రజలు తరచూ ఫిర్యాదులు చేయడంతో స్పందించిన కమిషనర్ ఆవుల యజమానులకు నోటీసులు ఇచ్చారు. అయినా పలువురు రోడ్లపైకి వదలడంతో పోలీసుల సహకారంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన గోశాలకు తరలించారు. వీధుల్లో తిరిగే ఆవులపై నిఘా పెడతామని, వాటి యజమానులు ఇంటి వద్ద ఉంచుకోవాలని తెలిపారు. సీఐ సుబ్బారావు, రూరల్ ఎస్సై అంకమరావు ఉన్నారు.

255 మంది విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



పది విద్యార్థులతో లయన్స్ క్లబ్ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల పదో తరగతి చదువుతున్న 255 మంది విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్టడీ మెటీరియల్ డిప్యూటీ విద్యాశాఖాధికారి శామ్యేల్ జాన్ అందించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు టీవీ రామకృష్ణారావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు నాణ్యమైన మెటీరియల్ అందించామని, పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మార్కాపురానికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు తేవాలని సూచించారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, ట్రెజరర్ రంగయ్య, వైస్ ప్రెసిడెంట్ భూపని కాశయ్య, అడ్మినిస్ట్రేటర్ ఎస్.శివప్రసాద్, డైరెక్టర్‌లు కేవీ జగన్‌బాబు, కృష్ణమూర్తి, గోపాల్, వి.నరసింహారావు, వెంకట నారాయణరెడ్డి, డిస్ట్రిక్ట్ కో ఆర్డినేటర్ ఎస్.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రైతులకు విశిష్ట సంఖ్య తప్పనిసరి

పొదిలి రూరల్: ప్రభుత్వ పథకాలు పొందాలంటే రైతులకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరిగా ఉండాలని దర్శి సహాయ వ్యవసాయ సంచాలకులు కె.బాలాజీ నాయక్ అన్నారు. బుధవారం పొదిలి మండలం పాములపాడు, ఈగలపాడు గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించారు. ఏడీఏ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రైతు విశిష్ట గుర్తింపు కార్డుకు రైతులంతా దరఖాస్తు చేసుకుని ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. దీనికి రైతులు తమ సమీపంలోని రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి ఆధార్‌కార్డుకు లింకైన ఫోన్ నంబర్, ఆధార్ కార్డు, పట్టాదారు పాసు పుస్తకం, తీసుకెళ్లి ఆన్‌లైన్ నమోదు చేయించుకుని డిజిటల్ గుర్తింపు కార్డు పొందాలన్నారు. ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలు రైతులకు నేరుగా వచ్చేందుకు డిజిటల్ గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఏఓ జైన్ లాబ్దిన్ మాట్లాడుతూ ఖరీఫ్‌లో కంది పంట నమోదు చేయించుకున్న రైతులంతా కంది కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకునేందుకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. రబీలో వేసిన పంటలను ఎవరైనా నమోదు చేయించుకోకుంటే వెంటనే చేయించుకోవాలని తెలిపారు. సంధ్య ఉన్నారు.

దిగుబడి లేక..
ధర రాక

● తుఫాన్, తెగుళ్ల ధాటికి తగ్గిన శనగ, పొగాకు దిగుబడులు
● మరోవైపు మార్కెట్‌లో తగ్గిన ధరలు
● సబ్ డివిజన్‌లో శనగ 9,790 ఎకరాలు, పొగాకు 1,385 ఎకరాల్లో సాగు
● ప్రభుత్వం ఆదుకోవాలంటున్న రైతులు

కంభం:

ఆరుగాలం శ్రమించి వ్యవసాయం చేసినా ఆశించిన దిగుబడులు రాక ఇబ్బందులు పడుతున్న రైతులకు పండించుకున్న పంటలకు మద్దతు ధర కూడా లేకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. దీంతో రైతన్నల పరిస్థితి దయనీయంగా మారింది. మార్కాపురం సబ్‌డివిజన్ పరిధిలో అధికారులు ఈ క్రాప్ చేసిన ప్రకారం శనగ 9790 ఎకరాలు, పొగాకు 1385 ఎకరాల్లో సాగులో ఉంది వీటితో పాటు కంది, మిరప పంటను రైతులు అధికంగా సాగు చేశారు.

తగ్గిన శనగ దిగుబడి:
శనగ పంట పూతదశలో ఉన్న సమయంలో వచ్చిన తుఫాన్ దెబ్బకు బూడిద తెగులు సోకి పూత రాలిపోవడంతో శనగ దిగుబడి సగానికి పడిపోయిందని రైతులు వాపోతున్నారు. ఎకరాకు 6–10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ప్రస్తుతం 5 క్వింటాళ్లలోపే వస్తోంది. మార్కెట్‌లో క్వింటా ధర రూ.5 వేల నుంచి రూ.5500 వరకు ఉంది. దిగుబడి తగ్గిన సమయంలో ధరలు కూడా పడిపోయాయి. శనగ పెరకడానికి, మిషను పట్టడానికి కూలీల ఖర్చులు పెరిగాయని గిట్టుబాటు ధరలు లేకపోతే తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు.

నష్టాలబారిన పొగాకు రైతులు
గతేడాది పొగాకు ధరలు ఎక్కువగా ఉండటంతో పొగాకు సాగుకు ఆసక్తి కనబరిచిన రైతులకు ఈ ఏడాది సాగు కలసిరాలేదు. సాగుకు ముందు వర్షాభావం, పైరు వివిధ దశల్లో ఉన్న సమయంలో అధిక వర్షాలు, చీడపీడల ధాటికి నాణ్యత లోపించడంతో పాటు దిగుబడి తగ్గిపోయింది. మార్కాపురం సబ్‌డివిజన్ లో ఈ క్రాప్ నమోదు ప్రకారం 1385 ఎకరాల్లో పొగాకు సాగులో ఉంది. పశ్చిమ ప్రకాశంలో కంభం మండలంలోని జంగంగుంట్లలో రైతులు అధికంగా పొగాకు సాగు చేస్తుంటారు. ఎకరా పొగాకు రూ. 50 వేల నుంచి రూ.60 వేల వరకు ఖర్చు వస్తోంది. అధిక వర్షాల కారణంగా దిగుబడులు తగ్గడంతో పాటు మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు రైతులకు ఆందోళన కలిగిస్తున్నాయి. గతేడాది క్వింటా పొగాకు రూ.12 వేలు ధర పలకగా ఈ ఏడాది రూ.8 వేలకు పడిపోయిందని రైతులు చెబుతున్నారు. ఈ ధరకు విక్రయిస్తే పెట్టుబడులు కూడా రావని వాపోతున్నారు. ప్రస్తుతం ఆకు కొట్టడం, తోరణాలుగా కుట్టడం, పందిర్లు వేయడం వంటి పనులు జరుగుతున్నాయి. ప్రభుత్వం స్పందించి మద్దతు ధర కల్పించాలని రైతులు కోరుతున్నారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న శనగలు



పొగాకు

రైతులపై కూటమి ప్రభుత్వం చిన్నచూపు:
రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించింది. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం నెరవేర్చకుండా రైతులను నట్టేట ముంచింది. ప్రతి ఏడాది రైతులకు రూ.20 వేల సాయం అందిస్తామని ప్రకటించినా అది నేటికీ అందలేదు. ఉచిత పంటల బీమా పథకానికి స్వస్తి పలికారు. రైతులే ఇక నుంచి బీమా కంపెనీలకు ప్రీమియం చెల్లించాలని ప్రభుత్వం చెప్పడంతో రైతులకు భారంగా మారింది. ప్రస్తుతం పంటనష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందుతుందో లేదో తెలియని పరిస్థితుల్లో రైతులు ఉన్నారు. శనగ పంట దిగుబడిని పంట కోత ప్రయోగాల ద్వారా అంచనా వేస్తున్నారు. దిగుబడి ఉన్న చోట అంచనా వేసి మిగిలిన అన్ని ప్రాంతాలకు దాన్నే ప్రామాణికం చేసుకుంటే తాము తీవ్రంగా నష్టపోతామని పలువురు శనగ రైతులు వాపోతున్నారు. పంట దిగుబడి తగ్గిన రైతులందరికీ న్యాయం జరిగేలా నష్టపరిహారం అందించడంతో పాటు గిట్టుబాటు ధరలు కల్పించాలని రైతులు కోరుతున్నారు.

పెట్టుబడులు పెరిగి.. దిగుబడి తగ్గింది



10 ఎకరాల్లో శనగ, 30 ఎకరాల్లో పొగాకు వేశాను. ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. దీనికి తోడు ధరలు లేక పోవడంతో తీవ్రంగా నష్టం వాటిల్లుతుంది. ప్రభుత్వం మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలి.

– వెలుతుర్ల హరిబాబు, రైతు, జంగంగుంట్ల

పొగాకు నాణ్యత తగ్గిపోయింది



20 ఎకరాల్లో పొగాకు సాగు చేశాను. ఈ ఏడాది వర్షాల దెబ్బకు పొగాకు నాణ్యత దెబ్బతింది. పండిన పంట కూడా ఎక్కువ శాతం నాణ్యత లోపించడంతో రైతులు తీవ్రంగా నష్టపోవాల్సి వస్తోంది. పెట్టిన పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితులు కనబడం లేదు. రైతులకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– గొంగటి వెంకటరామిరెడ్డి, పొగాకు రైతు

నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి



గతంలో క్వింటా పొగాకు రూ.12 వేలు పలికింది దీంతో పొగాకు సాగుకు రైతులు ఆసక్తి చూపారు. ప్రస్తుతం ధర సగానికి పడిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. తుఫాన్, తెగుళ్ల ధాటికి శనగ దిగుబడి కూడా తగ్గిపోయింది. ప్రభుత్వం రైతులకు గిట్టుబాటు ధరలు కల్పించడంతో పాటు పంట నష్టపరిహారం అందించి ఆదుకోవాలి.

– నెమలిదిన్నె చెన్నారెడ్డి, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, కంభం

బెల్లం రమాదేవికి మాజీ ఎమ్మెల్యే అన్నా నివాళి



పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిస్తున్న అన్నా రాంబాబు

గిద్దలూరు రూరల్: పట్టణానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకురాలు బెల్లం రమాదేవి అంత్యక్రియల్లో బుధవారం గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ అన్నా రాంబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె భర్త నరసింహారావుతో పాటుగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఇటీవల యడవల్లి క్రాస్ రోడ్డు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో రమాదేవి గాయపడి కర్నూలు వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయమే. ఈ సందర్భంగా అన్నా రాంబాబు మాట్లాడుతూ బెల్లం రమాదేవి పార్టీ కోసం కష్టపడి పనిచేశారని, ఆమె మరణం పార్టీకి తీరని లోటు అని అన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట వైస్ చైర్మన్ ఆర్.డి.రామకృష్ణ, కౌన్సిలర్లు బాలిరెడ్డి, దొంత లక్ష్మీదేవి, వైఎస్సార్ సీపీ నాయకులు డా.భూమా నరసింహారెడ్డి, చేగిరెడ్డి శ్రీకాంత్‌రెడ్డి, మత్తయ్య, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీనిధి రుణాలు రికవరీ చేయాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి చెన్నకేశవులు

కొనకనమిట్ల: గ్రామాల్లో పొదుపు గ్రూపుల సభ్యులు తీసుకున్న స్త్రీనిధి రుణాలు రికవరీ చేయడంతో పాటు గ్రూపుల అభివృద్ధే లక్ష్యంగా గ్రామైఖ్య సంఘం సభ్యులు కృషి చేయాలని స్త్రీనిధి రాష్ట్ర ప్రత్యేకాధికారి చెన్నకేశవులు అన్నారు. బుధవారం స్థానిక మహిళా సమాఖ్య కార్యాలయంలో కొనకనమిట్ల, పొదిలి మండలాల వీఓఏలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రూపు సభ్యులు తీసుకున్న రుణాలను సక్రమంగా కట్టించేలా, మళ్లీ కొత్తగా బ్యాంక్ రుణాలు ఇప్పించేలా గ్రామైఖ్య సంఘం కృషి చేయాలన్నారు. స్త్రీనిధి రుణాలు సకాలంలో చెల్లించేలా సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏజీఎం హర్షవర్ధన్, ఏసీ సుధాకర్, ఏపీఎంలు బి.సుధాకర్, కె.గోపాలకృష్ణారెడ్డి, స్త్రీనిధి మేనేజర్ సులోచన, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఈశ్వరమ్మ, ఎఫ్‌పీఓ అరుణ కుమారి, సీసీలు సాయిలు, లక్ష్మీరెడ్డి, గ్రామ సంఘం ఓబీలు, వీఓఏలు పాల్గొన్నారు.

సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలి



దీక్ష చేస్తున్న కార్మికులు

మార్కాపురం టౌన్: మున్సిపల్ కార్మికుల సమ్మె కాలపు ఒప్పందాలకు ప్రభుత్వం జీవోలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన కార్మికుల దీక్షా కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడుతూ గతంలో మున్సిపల్ కార్మికులు తమ డిమాండ్ల సాధనకు 17 రోజులు సమ్మె చేశారన్నారు. అప్పట్లో కార్మికులకు ప్రభుత్వానికి జరిగిన ఒప్పందాల మేరకు ప్రభుత్వం వెంటనే జీవోలు విడుదల చేయాలని కోరారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్న నేటి ముఖ్యమంత్రి చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారన్నారు. జీవో నెం 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలన్నారు. వారికి అదనపు పనులు కేటాయించినప్పుడు టీఏ, డీఏలు చెల్లించాలని, వారి ఉద్యోగాలను వెంటనే పర్మినెంట్ చేయాలని కోరారు. యూనియన్ నాయకులు సుబ్బరాయుడు, హరి, ఇమాంసా, సలాంఖాన్, శ్రీను, చెన్నకేశవులు, అల్లూరయ్య, చెన్నయ్య, గురునాథం, మరియదాసు పాల్గొన్నారు.

పీస్ గూడ్స్ కార్మికుల వేతనాలు పెంచాలి

మార్కాపురం: పీస్ గూడ్స్ పలకల కార్మికుల వేతనాలు పెంచాలని ఏఐటీయూసీ నాయకులు ఎస్‌కే ఖాశీం పలకల ఫ్యాక్టరీల యజమానులను కోరారు. బుధవారం పూలసుబ్బయ్య భవనంలో పలకల కార్మికుల సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఈ నెల 18వ తేదీన పీస్ గూడ్స్ పలకల కూలి పెంచి మూడేళ్లు దాటుతుందని, ఒప్పందం ప్రకారం ఫ్యాక్టరీల యజమానులు కార్మికుల వేతనాలు పెంచాలన్నారు. పలకల కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ కల్పించాలన్నారు. సమావేశంలో నాగూర్ మీరావలి, రామయ్య, వెంకటరెడ్డి, రమణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

నిత్యావసర సరుకులు
సక్రమంగా పంపిణీ చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బేస్తవారిపేట: మండలంలోని ప్రభుత్వ చౌకధర దుకాణాల పరిధిలో నిత్యావసర వస్తువులు సక్రమంగా పంపిణీ చేయడం లేదని సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఊరుమార్పు జోసఫ్, రైతు సంఘం నియోజకవర్గ కార్యదర్శి ఢాకాల పుల్లయ్య అన్నారు. ఆమేరకు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జితేంద్రకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. బియ్యం, జొన్నలు, చక్కెర, కందిపప్పు సక్రమంగా ఇవ్వడంలేదన్నారు. ఒక నెల ఒకటి ఇస్తే మరొకటి ఇవ్వడం లేదని చెప్పారు.

కౌలు రైతులకు నూతన చట్టం తీసుకురావాలి
కౌలు రైతుల రక్షణ, సంక్షేమం కోసం నూతన సమగ్రమైన చట్టాన్ని తీసుకురావాలని వ్యవసాయశాఖ మంత్రికి వినతిపత్రం పంపాలని తహసీల్దార్‌కు సీపీఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. సాగు భారం పెరగడంతో ఈ ఎనిమిది నెలల కాలంలో 97 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కౌలు కార్డులు ఉన్న రైతులకు హామీలేని రూ.2 లక్షల పంట రుణాలు మంజూరు చేయాలన్నారు. కౌలుమిత్ర గ్రూప్‌లు ఏర్పాటు చేసి వడ్డీ రాయితీ పంట రుణాలు అందించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకట కొండయ్య, వీ శ్రీనివాసులు, అంకయ్య పాల్గొన్నారు.

గ్యాస్ వాడకంపై అవగాహన

మార్కాపురం: గ్యాస్ వినియోగంలో అవగాహన లేకుంటే ప్రమాదాలు జరుగుతాయని, పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని పీఎల్‌పీ ఇండియన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్ పీఎల్‌పి ప్రసాద్ యాదవ్ చెప్పారు. బుధవారం స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సేఫ్టీ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్యాస్ స్టౌ పనితీరును తరచూ పరిశీలించాలని, ఐఎస్ఓ గుర్తింపు కలిగిన గ్యాస్ పైపులను వాడాలన్నారు. వాటిపై తయారీ తేదీ, ముగింపు తేదీ చూసుకోవాలని, 2 సంవత్సరాల కాలపరిమితి ముగిసేలోగా నూతన పైపును ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. అనంతరం పలువురితో డెమో నిర్వహించారు. హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ ఉమ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు యూనిక్ ఐడీ

బేస్తవారిపేట: ప్రతి రైతు రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి ఏపీ ఫార్మర్ రిజిస్ట్రేషన్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేయించుకోవడంతో ఒక యూనిక్ ఐడీ కేటాయిస్తారని వ్యవసాయాధికారిణి జక్కం మెర్సీ అన్నారు. బుధవారం మండలంలోని సలకలవీడు, కొత్తపల్లెలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్‌లో యూనిక్ ఐడీ ఉన్న రైతులకే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకాలు అందుతాయన్నారు. ప్రతి రైతు తప్పనిసరిగా ఏపీ ఎఫ్‌ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఉద్యాన యాంత్రీకరణ పథకంలో తైవాన్ స్ప్రేయర్లు, వ్యక్తిగత నీటి కుంటలు, ప్యాక్ హౌస్‌లు 50 శాతం సబ్సిడీపై అందజేస్తారన్నారు.

వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



పూజలు చేస్తున్న అనువంశిక ధర్మకర్త విజయభాస్కరరావు దంపతులు

తర్లుపాడు: స్థానిక ప్రఖ్యాత శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం అంకురార్పణతో ప్రారంభమయ్యాయి. అర్చకులు రమణాచార్యులు, లక్ష్మణ తిలక్, రామగోపాలాచార్యుల ఆధ్వర్యంలో స్వామివార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త జవ్వాజి విజయభాస్కర్‌రావు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి విశ్వక్సేన పూజ, పుణ్యహవాచనం, రక్షా బంధనం, రుత్విక్ వరుణ, భేరీ పూజ, ధ్వజారోహణం నిర్వహించారు. సాయంత్రం ఎదుర్కోల, రాయబారం నిర్వహించారు. ఈఓ చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

మతిస్థిమితం లేని వ్యక్తి గుర్తింపు

మార్కాపురం: మండలంలోని రాయవరం, రైల్వేస్టేషన్ సమీపాన బుధవారం ఉదయం మతిస్థిమితం లేని వ్యక్తి అనుమానాస్పదంగా సంచరిస్తుండటంతో గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు సమాచారం ఇచ్చారు. రూరల్ ఎస్సై అంకమరావు అక్కడికి వెళ్లి విచారించగా హిందీ, కన్నడ భాషలు మాత్రమే మాట్లాడుతున్నాడని, మతిస్థిమితం లేని వ్యక్తిగా గుర్తించామని చెప్పారు. ఉదయం రైలు దిగి నడుచుకుంటూ రావడంతో గ్రామస్తులు అనుమానించి తమకు సమాచారం చెప్పారని ఎస్సై తెలిపారు.

దేవాలయాలను కాపాడుకుందాం



భక్తులకు అన్నదానం చేస్తున్న నారాయణరెడ్డి

గిద్దలూరు రూరల్: మన దేవాలయాలను మనమే కాపాడుకోవాలని ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ సంఘ సేవకులు బి.ఎస్.నారాయణరెడ్డి అన్నారు. పౌర్ణమి సందర్భంగా పట్టణంలోని కాశినాయన ఆలయ ప్రాంగణంలోని గాయత్రి మాత ఆలయం వద్ద బుధవారం గాయత్రి యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన సనాతన ధర్మాన్ని రక్షించుకునేందుకు అందరం ఐక్యంగా ఉండాలని కోరారు. దేవాలయాల అభివృద్ధికి సహకరిస్తూ మన సంస్కృతిని కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. గాయత్రి యజ్ఞం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. ఈ సందర్భంగా భక్తులకు తీర్థప్రసాదాలతో పాటుగా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో గాయత్రి పరివార్ సభ్యులు పి.హనుమంతారెడ్డి, రామచంద్రారెడ్డి, వీరారెడ్డి, రెడ్డిమల్లారెడ్డి, పాల్గొన్నారు.

టెన్నిస్ విజేతలకు సత్కారం



టెన్నిస్ విజేతలను సన్మానిస్తున్న నిర్వాహకులు

గిద్దలూరు రూరల్: కనిగిరి లాన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇన్విటేషన్ టెన్నిస్ టోర్నమెంట్‌లో 45 ప్లస్ విభాగంలో గిద్దలూరుకు చెందిన రంగయ్య, మురళీమోహన్‌రెడ్డిలు విజేతలుగా నిలిచిన సందర్భంగా బుధవారం స్థానిక టెన్నిస్ కోర్టు ఆవరణలో జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జిల్లా లాన్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డా.జి.కె.మోహన్‌రెడ్డి మాట్లాడుతూ నరసరావుపేటకు చెందిన రాము, కోటిరెడ్డి లపై గిద్దలూరు టెన్నిస్ కోర్టు కు చెందిన మురళీమోహన్‌రెడ్డి, రంగయ్యలు విజయం సాధించడం మన ప్రాంతానికి మంచి గుర్తింపు వచ్చిందన్నారు. టెన్నిస్ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి చూపాలని కోరారు. కార్యక్రమంలో టెన్నిస్ కోర్టు నిర్వాహకులు వీరరాఘవులు, శివప్రసాద్, రాచంద్రారెడ్డి, టపావలి, ఖాదర్‌బాష, డా.సందీప్, మహేష్‌కుమార్, పాల్గొన్నారు.

ఏపీ ఎన్జీవోస్ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్

మార్కాపురం టౌన్: ఏపీ ఎన్జీవోస్ అసోసియేషన్ మార్కాపురం తాలుకా యూనిట్ క్యాలెండర్ 2025ను సబ్ కలెక్టర్ వెంకట త్రివినాగ్ తన కార్యాలయంలో బుధవారం రాత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో యూనియన్ నాయకులు కృషి చేయాలని కోరారు. యూనియన్ నాయకులు శ్రీనివాస శాస్త్రి, శ్రీనివాస్, నాగేంద్రరెడ్డి, జనార్దన్‌రెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

సచివాలయం తనిఖీ

కొమరోలు: మండలంలోని రాజుపాలెం గ్రామ సచివాలయాన్ని ఎంపీడీవో మస్తాన్‌వలి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను తనిఖీ చేసి కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సిబ్బంది సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ప్రజలను ఇబ్బంది పెట్టొద్దని ఎంపీడీవో సూచించారు.